ఆదివారం
19-01-2025

# ముందడుగు

దినపత్రిక

సంపుటి: 1, సంచిక: 548 పేజీలు: 4 | ₹6
EPAPER.MUNDADUGU.COM
SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD | KARIMNAGAR | WARANGAL | JAGITYAL | KHAMMAM | NALGONDA | MAHABOOBNAGAR | NIZAMABAD

మీ ప్రాంతంలో జరిగే ఏలాంటి సమస్య ఐనా ముందడుగు దృష్టికి తీసుకురండి.. సమస్య పరిష్కారానికి ప్రయత్నం చేద్దాం. మీ ప్రాంతంలో మీరు ముందడుగు పౌర పాత్రికేయుడిగా పనిచెయోచ్చు.. మీ సమస్యలపై స్పందించండి..

Mundadugu whatsapp:
9491114616
email: mundadugu111@gmail.com

సైఫ్ అలీఖాన్‌పై దాడి

## నిందితుడు అరెస్ట్

- ఛత్తీస్‌గఢ్‌లో అదుపులో తీసుకున్న పోలీసులు



3 లో

## దేశ ప్రజలకు ఆస్తి కార్డులను పంపిణీ

- వర్చువల్ విధానంలో 65 లక్షల మందికి అందజేత
- వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రసంగించిన మోడీ

2 లో



ఉగాదికి

## గద్దర్ అవార్డులు ప్రధానం

- చిత్ర పరిశ్రమ అభివృద్ధికి అన్ని రకాల చర్యలు
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

3 లో



అరవింద్ కేజ్రీవాల్

## కాన్వాయ్‌పై దాడి

- ఇదంతా భాజపా కుట్రేనని ఆప్ ఆరోపణ

2 లో



సంజయ్ రాయ్‌నే

## దోషి..

- ఆర్జీకర్ ఆస్పత్రి వైద్యురాలి కేసులో కోర్టు తీర్పు
- జనవరి 20న శిక్ష ఖరారు
- తీర్పును గౌరవిస్తున్నామన్న మృతురాలి తండ్రి


2 లో




## ఢిల్లీలో రేవంత్ ఆబద్ధపు ప్రచారాలు

2 లో

- తెలంగాణలో చిరు ఉద్యోగుల కష్టాలు
- నెలలుగడిచినా ఉద్యోగులకు అందని వేతనాలు
- మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శలు



ముందడుగు
ఆదివారం
19-01-2025
హైదరాబాద్

## దేశ ప్రజలకు
# ఆస్తి కార్డులను పంపిణీ

ముందడుగు జాతీయం

దేశంలోని సర్వే ఆఫ్ విలేజెస్ అండ్ మ్యాపింగ్ విత్ ఇంప్రూవైజ్డ్ టెక్నాలజీ ఇన్ విలేజ్ ఏరియాస్ పథకం కింద ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ దేశ ప్రజలకు ఆస్తి కార్డులను పంపిణీ చేశారు. శనివారం వర్చువల్ విధానంలో ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన.. దాదాపు 65 లక్షల మందికి పైగా కార్డులు అందించారు. ఈ పథకం కింద దేశంలోని 10 రాష్ట్రాలు, రెండు కేంద్రపాలిత ప్రాంతాల్లోని 230 జిల్లాల్లోని లబ్ధిదారులు కార్డులు అందుకున్నారు. గ్రామీణ ప్రజలకు సాధికారికత కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం స్వామిత్వ పథకాన్ని ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. నేడు మొత్తం 50 వేల గ్రామాల్లోని లబ్ధిదారులకు ఈ పథకం కింద ప్రయోజనం చేకూరింది. ఈసందర్భంగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వారిని ఉద్దేశించి ప్రధాని ప్రసంగించారు. "ఈ రోజు చారిత్రాత్మకమైన రోజు. ఒడిశా, ఛత్తీస్‌గఢ్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, గుజరాత్ ముఖ్యమంత్రులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. లక్షలాది మంది ఈ పథకం ప్రయోజనాలు పొందుతున్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన వారికి కృతజ్ఞతలు. లబ్ధిదారులకు నా అభినందనలు" అని ప్రధాని పేర్కొన్నారు.

# సంజయ్ రాయ్‌నే దోషి

ముందడుగు పశ్చిమ బెంగాల్

దేశవ్యాప్తంగా పెను సంచలనం రేపిన పశ్చిమ బెంగాల్ ఆర్జీకర్ ఆస్పత్రి వైద్యురాలిపై అత్యాచారం కేసులో కోల్‌కతాలోని సీల్దా కోర్టు శనివారం తీర్పు వెలువరించింది. ప్రధాన నిందితుడు సంజయ్ రాయ్‌ను దోషిగా తేల్చింది. అతడికి జనవరి 20న శిక్ష ఖరారు చేయనుంది.

"నీకు శిక్ష తప్పదు. బాధితురాలిని నీవు చంపిన తీరుకు యావజ్జీవ కారాగార శిక్ష లేక మరణశిక్ష విధించవచ్చు. సోమవారం శిక్షఖరారు చేస్తాం" అని న్యాయమూర్తి అన్నారు. సీబీఐ సమర్పించిన ఆధారాల మేరకు సంజయ్‌ను కోర్టు దోషిగా తేల్చింది. తీర్పు నేపథ్యంలో భారీ భద్రత మధ్య సంజయ్‌ను కోర్టుకు తీసుకువచ్చారు. తాను ఏ తప్పూ చేయలేదని, తనను తప్పుడు కేసులో ఇరికించారని ఈ సందర్భంగా జడ్జికి సంజయ్ తెలిపాడు. అతనికి సోమవారం మాట్లాడే అవకాశం ఇస్తామని న్యాయమూర్తి వెల్లడించారు. ఈ తీర్పును తాను గౌరవిస్తున్నానని మృతురాలి తండ్రి కోర్టులో కన్నీటిపర్యంతమయ్యారు.

## అరవింద్ కేజ్రీవాల్
# కాన్వాయ్‌పై దాడి

ముందడుగు ఢిల్లీ

ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ కాన్వాయ్‌పై కొందరు దుండగులు దాడికి యత్నించారు. ఎన్నికల ప్రచారం చేస్తున్న సమయంలో ఈ ఘటన చోటు చేసుకుంది. ఈ ఘటనపై తీవ్రంగా స్పందించిన ఆప్.. ఇదంతా భాజపా కుట్రేనని ఆరోపించింది.

ఢిల్లీలో అసెంబ్లీ ఎన్నికలకు సమయం సమీపిస్తోంది. ఈ నేపథ్యంలోనే న్యూఢిల్లీ నియోజకవర్గంలో కేజ్రీవాల్ ఇంటింటి ప్రచారం చేపట్టారు. అదే సమయంలో కొందరు దుండగులు ఆయన కాన్వాయ్‌పై రాళ్లు రువ్వారు. "భాజపాకు ఓటమి భయం పట్టుకుంది. ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఆ పార్టీ ఆందోళనకు గురవుతోంది. అందుకే కేజ్రీవాల్ ప్రచారాన్ని అడ్డుకునేందుకు ప్రయత్నిస్తోంది. ఆయన ప్రచారం చేస్తుండగా భాజపాకు చెందిన కొందరు కాన్వాయ్‌పై రాళ్లు రువ్వారు. కానీ, ఈ చర్యలకు ఆప్ భయపడదు. ఎన్నికల్లో ప్రజలు మీకు తప్పకుండా బుద్ధి చెబుతారు" అని 'ఎక్స్' (ట్విటర్) వేదికగా ఆప్ ఆరోపించింది. ఈ ఘటనకు సంబంధించిన వీడియోను షేర్ చేసింది.

## ఢిల్లీలో రేవంత్
# ఆబద్ధపు ప్రచారాలు

ముందడుగు హైదరాబాద్




తెలంగాణలో ఒకటో తేదీనే వేతనాలు చెల్లిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన ప్రభుత్వానికి చిరు ఉద్యోగుల కష్టాలు కనిపించకపోవడం దురదృష్టకరమని మాజీ మంత్రి హరీశ్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేశామని దిల్లీకి వెళ్లి అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనలో వేతనాలు అందక ఉద్యోగులు రోడ్డెక్కుతున్న దుస్థితి నెలకొందని ఆక్షేపించారు. నాలుగు నెలలుగా పంచాయతీ కార్మికులకు, మూడు నెలలుగా ఉపాధిహామీ ఉద్యోగులు, పారిశుద్ధ్య కార్మికులు వేతనాలు అందక ఇబ్బంది పడుతున్నారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు అన్ని జిల్లాల్లోనూ ఇదే పరిస్థితి ఉన్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దుర్మార్గమని మండిపడ్డారు. నెలలు గడిచినా వేతనాలు రాకపోవడంతో కుటుంబ పోషణ భారమై, అప్పులపాలవుతున్నారన్నారు. తన కుర్చీని కాపాడుకోవడం కోసం దిల్లీకి చక్కర్లు కొట్టడం, విదేశాల నుంచి రూ. వేల కోట్ల పెట్టుబడులు తెస్తున్నామనే ప్రచారం చేసుకోవడం మానేసి పాలనపై దృష్టి పెట్టాలని సూచించారు. ఇప్పటికైనా చిరు ఉద్యోగులందరికీ సకాలంలో వేతనాలు చెల్లించాలని ప్రభుత్వాన్ని హరీశ్ రావు డిమాండ్ చేశారు.

ముందడుగు
ఆదివారం
19-01-2025
హైదరాబాద్

## తెలంగాణలో
# ఎస్‌టీటీ డేటా సెంటర్ పెట్టబడులు

### రూ.3,500 కోట్ల పెట్టుబడులతో ఒప్పందం



ముందడుగు తెలంగాణ

తెలంగాణ రాష్ట్రంలో ఎస్‌టీటీ డేటా సెంటర్ భారీ పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చింది. ఈ సంస్థ రూ. 3,500 కోట్ల పెట్టుబడి పెట్టేందుకు మంత్రి శ్రీధర్‌బాబు సమక్షంలో రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది. సింగపూర్‌లోని ఎస్‌టీటీ డేటా సెంటర్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎంవో యూపై ఎస్‌టీటీ సీఈవో బ్రూనోసంతకాలు చేశారు. ఇప్పటికే హైటెక్ సిటీలో ఓ డేటా సెంటర్ నిర్వహిస్తోన్న ఎస్‌టీటీ.. ముచ్చర్ల మీర్‌ఖాన్‌పేట్‌లో మరో డేటా సెంటర్‌ను ఏర్పాటు చేయనుంది. ఎస్‌టీటీ డేటా సెంటర్ సంస్థ నిర్ణయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ఆహ్వానించారు. డేటా సెంటర్ హబ్‌గా హైదరాబాద్ మారుతోందని హర్షం వ్యక్తం చేశారు.

## సైఫ్ అలీఖాన్‌పై
# దాడి నిందితుడు అరెస్ట్

ముందడుగు జాతీయం

నటుడు సైఫ్ అలీఖాన్‌పై దాడికి పాల్పడిన నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఛత్తీస్‌గఢ్‌లోని దుర్గ్‌లో అతడని గుర్తించిన రైల్వే పోలీసులు వెంటనే అదుపులోకి తీసుకున్నారు. జ్ఞానేశ్వరి ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణిస్తుండగా నిందితుడిని పట్టుకుని, వీడియో కాల్ ద్వారా ముంబయి పోలీసులతో మాట్లాడి, అతడేనని ధ్రువీకరించుకున్నారు. రైల్వే పోలీసుల అదుపులో ఉన్న నిందితుడిని తీసుకొచ్చేందుకు ముంబయి పోలీసులు బయలుదేరి ఛత్తీస్‌గఢ్‌కు వెళ్తున్నారు.

గురువారం తెల్లవారుజామున 2.30 గంటలకు సైఫ్‌పై ఈ దాడి ఘటన చోటుచేసుకుంది. సైఫ్, అతడి కుటుంబసభ్యులు నిద్రలో ఉండగా.. ఇంట్లోకి చొరబడిన దుండగుడు చోరీకి యత్నించాడు. సైఫ్ అడ్డుకునేందుకు ప్రయత్నించగా దాడి చేసి పరారయ్యాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న ముంబయి పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.

## ఉగాదికి
# గద్దర్ అవార్డులు ప్రధానం

ముందడుగు హైదరాబాద్

ఈ సంవత్సరం ఉగాదికి గద్దర్ (సినిమా) అవార్డులను ప్రదానం చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. ఈ మేరకు సచివాలయంలో జరిగిన గద్దర్ అవార్డుల కమిటీ సమావేశంలో డిప్యూటీ సీఎం వెల్లడించారు. అవార్డుల ప్రదానోత్సవానికి ఏర్పాట్లు చేసుకోవాలని కమిటీ సభ్యులు, అధికారులకు సూచించారు. సినిమా నిర్మాణంలో హైదరాబాద్‌ను ప్రపంచ గమ్యస్థానంగా మారుస్తామని ఈ సందర్భంగా భట్టి తెలిపారు.

అవార్డుల కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నట్టు డిప్యూటీ సీఎం భట్టి వెల్లడించారు. అవార్డుల పంపిణీ కార్యక్రమాన్ని జాతీయ స్థాయి కార్యక్రమాల తరహాలో నిర్వహించాలని సూచించారు. గత పదేళ్లు రాష్ట్రాన్ని పాలించిన భారాస చిత్ర పరిశ్రమను నిర్లక్ష్యం చేసిందన్నారు. భారాస హయాంలో అవార్డుల పంపిణీ జరగలేదన్నారు. ఇందిరమ్మ ప్రభుత్వం అధికారంలోకి రాగానే సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో చిత్ర పరిశ్రమ అభివృద్ధికి అన్ని రకాల చర్యలు తీసుకున్నట్టు చెప్పారు. రాష్ట్రంలో సినిమాల నిర్మాణాన్ని ప్రోత్సహించే అవార్డులను ఏటా అంజేయాలని నిర్ణయించినట్టు భట్టి విక్రమార్క తెలిపారు.

## ఉగ్రవాదాన్ని
# పెంచి పోషించింది పాక్

- ఇప్పుడు ఆ దేశ ప్రజలనే కబళిస్తోంది
- భారత విదేశాంగశాఖ మంత్రి జైశంకర్



ముందడుగు జాతీయం

ఉగ్రవాదాన్ని 'క్యాన్సర్' వ్యాధిని ఒకప్పుడు పాక్ పెంచి పోషించిన ఉగ్రవాదం ఇప్పుడు ఆ దేశ ప్రజలనే కబళిస్తోందని భారత విదేశాంగశాఖ మంత్రి జైశంకర్ మరోసారి విరుచుకుపడ్డారు. ముంబయిలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న జైశంకర్.. దాయాదిపై విమర్శలు గుప్పించారు. " మన పొరుగున ఉన్న పాకిస్థాన్ సీమాంతర ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తోంది. అదే ఇప్పుడు వారి పాలిట శాపమైంది. అది క్రమంగా ఆ దేశ రాజకీయాల్లోకీ ప్రవేశిస్తోంది. సీమాంతర ఉగ్రవాదాన్ని అణచివేయాలని భారత్ సహా పలుదేశాలు కోరుతున్నాయి." అని జైశంకర్ తెలిపారు.

అభివృద్ధి చెందుతున్న దేశంగా భారత్ సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని, ఈ విషయంలో ఎలాంటి వెనుకబాటుకు తావివ్వకూడదని సూచించారు. పాశ్చాత్య విధానానికి భారత్ వ్యతిరేకమైనప్పటికీ.. వ్యూహాత్మక ప్రయోజనాల కోసం మద్దతిస్తుందని పేర్కొన్నారు. ఆయుధీకరణ విషయంలో భారత్ స్వావలంబన పెంచుకోవాల్సిన అవసరముందన్నారు.

ముందడుగు
ఆదివారం
19-01-2025
హైదరాబాద్

### జేసీ ప్రభాకర్ రెడ్డిపై

# న్యాయపోరాటం చేస్తాను

## 'మా'కు మాధవీలత ఫిర్యాదు



ముందడుగు హైదరాబాద్

అనంతపురం జిల్లా తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డిపై సినీ నటి మాధవీలత 'మా'కు, తెలుగు ఫిల్మ్ ఛాంబర్‌కు ఫిర్యాదు చేశారు. ప్రభాకర్ రెడ్డి తన గురించి చేసిన వ్యాఖ్యలపై సినీ పరిశ్రమ స్పందించ లేదు కాబట్టే మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్‌కు ఫిర్యాదు చేస్తున్నట్లు తెలిపారు. "ప్రభాకర్ రెడ్డి నా గురించి దారుణంగా మాట్లాడారు. సినిమా వాళ్లపై ఆరోపణలు చేయడం సరైనది కాదు. ఆయన క్షమాపణలు చెబితే సరిపోదు. ప్రభాకర్ రెడ్డిపై న్యాయపోరాటం చేస్తాను. ఆయన నాపై చేసిన వ్యాఖ్యలను సినీ పరిశ్రమ ఖండించలేదు. అందుకే ఫిల్మ్ ఛాంబర్‌లో ఫిర్యాదు చేస్తున్నాను" అని తెలిపారు. ఫిర్యాదు చేయడానికి ముందు మాధవీలత తన ఇన్‌స్టాలో 'న్యాయం కోసం నా పోరాటం' అని పోస్ట్ పెట్టారు.

## ఎన్టీఆర్‌కు నివాళులర్పించిన జూనియర్ ఎన్టీఆర్, కల్యాణ్ రామ్

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎం, టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా జూనియర్ ఎన్టీఆర్, కల్యాణ్ రామ్ నివాళులు అర్పించారు. శనివారం ఉదయం అన్న కల్యాణ్ రామ్‌తో కలిసి హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్ ఎన్టీఆర్ ఘాట్‌కు చేరుకున్న ఎన్టీఆర్.. తాత సమాధి వద్ద పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో వారి అభిమానులు ఎన్టీఆర్ ఘాట్‌కు తరలివచ్చారు.కాగా, ఎన్టీఆర్ సతీమణి లక్ష్మీ పార్వతి కూడా ఎన్టీఆర్ ఘాట్ వద్ద ఆయనకు నివాళులర్పించారు. ఇక, సీనియర్ హీరో, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ, ఏపీ మంత్రి నారా లోకేశ్ తదితరులు ఎన్టీఆర్ ఘాట్ వద్ద నివాళి అర్పించానున్నారు. అదేవిధంగా ఎన్టీఆర్ ట్రస్టు భవన్‌లో మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నారు.



### ఓటీటీలోకి

# 'విడుదల పార్ట్ 2'..

తమిళ కథానాయకుడు విజయ్ సేతుపతి, మంజు వారియర్ జంటగా నటించిన తాజా చిత్రం విడుదల పార్ట్ 2. ఈ సినిమాకు వెట్రి మారన్ దర్శకత్వం వహించగా.. కమెడియన్ సూరి కీలక పాత్రలో నటించాడు. 'విడుదల' చిత్రానికి కొనసాగింపుగా వచ్చిన ఈ చిత్రం డిసెంబర్ 20న ప్రేక్షకుల ముందుకు వచ్చి బాక్సాఫీస్ వద్ద యావరేజ్‌గా నిలిచింది. ఫస్ట్ పార్ట్ హిట్టు అవ్వడంతో భారీ అంచనాలతో పోయిన ప్రేక్షకులకు ఈ చిత్రం నిరాశ పరిచింది. అయితే రిలీజై నెల కూడా కాకుండానే ఈ చిత్రం ఓటీటీలోకి రాబోతుంది.ప్రముఖ ఓటీటీ వేదిక అమెజాన్ ప్రైమ్ వీడియోలో ఈ చిత్రం జనవరి 19 నుంచి తెలుగుతో పాటు తమిళం భాషల్లో స్ట్రీమింగ్ అవ్వబోతున్నట్లు చిత్రబృందం తెలిపింది. ఈ సందర్భంగా కొత్త పోస్టర్‌ను పంచుకుంది.

ఈ సినిమా కథ విషయానికి వస్తే.. కానిస్టేబుల్ కుమరేశన్ (సూరి) ఇచ్చిన క్లూతో ప్రజదళం నాయకుడు పెరుమాళ్ అలియాస్ మాస్టార్ (విజయ్ సేతుపతి)ని పోలీసులు అరెస్ట్ చేస్తారు. దీంతో పార్ట్ 1 కథం ముగుస్తుంది. అయితే అక్కడినుంచే పార్ట్ 2 ప్రారంభం అవుతుంది. స్కూల్ పిల్లలకు పాఠాలు చెప్పుకునే పెరుమాళ్ జమీందారి వ్యవస్థకు ఎందుకు అడ్డం తిరిగాడు. ఈ క్రమంలోనే అతడు నాయకుడిగా ఎలా మారాడు. అతడి జీవితంలోకి మహాలక్ష్మి (మంజు వారియర్) ఎలా వచ్చింది. తనను పట్టించిన కానిస్టేబుల్ కుమరేశన్ చివరకు ఏం చేశాడు అనేది తెలియాలంటే సినిమా చూడాల్సిందే.



# భారతదేశంలో విడుదలైన ఆల్-న్యూ బీఎండబ్ల్యూ ఆర్ 1300 జీఎస్ అడ్వెంచర్

ముందడుగు హైదరాబాద్



ఆల్-న్యూ బీఎండబ్ల్యూ ఆర్ 1300 జీఎస్ అడ్వెంచర్ భారతదేశంలో విడుదల చేశారు. ఈ అడ్వెంచర్ మోటార్‌సైకిల్ పూర్తిగా బిల్ట్-అప్ యూనిట్ గా అందుబాటులో ఉంటుంది మరియు డెలివరీలు ఏప్రిల్ 2025 నుంచి ప్రారంభమవుతాయి. విక్రమ్ పవా, ప్రెసిడెంట్ మరియు సీఈఓ, బీఎండబ్ల్యూ గ్రూప్ ఇండియా మాట్లాడుతూ, "అన్ని కొత్త బీఎండబ్ల్యూ ఆర్ 1300 జీఎస్ అడ్వెంచర్ ప్రపంచంలో పెద్ద అడ్వెంచర్ మోటార్‌సైకిళ్లలో కొత్త బెంచ్‌మార్క్, కొత్త అడ్వెంచర్ జీఎస్, 'ది రాక్', అతిపెద్ద ట్రావెల్ ఎండ్యూరోస్ పోర్ట్‌ఫోలియోలో అధిగమించలేనిదిగా ఉంటుంది. రెండు దశాబ్దాలకు పైగా ఫ్లాట్ ట్విన్ బాక్సర్ ఇంజిన్‌తో కూడిన పెద్ద బీఎండబ్ల్యూ జీఎస్ అడ్వెంచర్ సుదూర మోటార్‌సైకిల్ ప్రయాణాలకు పర్యాయపదంగా ఉంది. ఇది విస్తృత శ్రేణి ప్రామాణిక పరికరాలతో అమర్చబడింది, అత్యంత వ్యక్తిగతీకరించబడింది మరియు ఇది అపరిమితమైన మోటార్‌సైకిల్ అనుభవాన్ని ఆస్వాదించడానికి మిమ్మల్ని ఆహ్వానిస్తుంది. ఆల్-న్యూ బీఎండబ్ల్యూ ఆర్ 1300 జీఎస్ అడ్వెంచర్, లెజెండ్ ఇప్పటికే సంపూర్ణ సాహసానికి సంబంధించిన ప్రకటన - ఇది రాక్ సాలిడ్" అని వివరించారు.